సీరియల్

(గత సంచిక తరువాయి)

అశ్వని అనుమానంగా చూశాడు కార్తీక్ వంక.

కార్తీక్ కళ్ళతోనే సంజ్ఞ చేశాడు.

“సరే, మేం నమ్ముతాం, కాని మమ్మల్ని యేమైనా చెయ్యాలనుకున్నా, క్షుద్ర విద్యలు ప్రయోగించబోయినా మీ అంతు చూస్తాం!” అన్నాడు కార్తీక్.

అందులో ఓ వ్యక్తి ముందుకొచ్చి, “మాకు క్షుద్ర విద్యలు తెలియవు. ఆ విద్యలు తెలిసిన మాంత్రికుణ్ని అతని అనుచరుల్ని మీరు చంపేశారు కదా!” అన్నాడు.

“అయితే, మీరు మాంత్రికుడికి సంబంధించినవాళ్ళు కాదా?” హిమవంత్ అడిగాడు.

“ఒకవిధంగా సంబంధించిన వాళ్ళమేగాని, మీకు శత్రువులం కాదు! మా గురువుగారు వేరే వ్యక్తి! మాంత్రికుడు ఆయనకు సంబంధించిన మనిషి. అలాగే మాంత్రికుడి అనుచరులుకూడా!”

"అయితే మీ గురువు ఎవరు?"

"ఆయన పేరు మాకు తెలియదు. అందరం కళ్యాణ స్వామి అంటాం."

"కళ్యాణస్వామినా? వింత పేరు? ఆయన వుండే దెక్కడ?" అడిగాడు కార్తీక్.

"కళ్యాణ దుర్గం!"

కార్తీక్‌తో బాటు తక్కిన యిద్దరు ఆశ్చర్యంగా నోళ్ళు తెరిచారు. "కళ్యాణ దుర్గమా?" అన్నారు.

"అవును కళ్యాణ దుర్గంలో ఓ రహస్య స్థలంలో మా స్వామి వున్నారు. ఆయనతో బాటు మేముకూడా అక్కడే వుంటున్నాం!"

"ఎందుకు? యే పనిమీద వుంటున్నారు?"

"ఆ విషయం మాట్లాడుదామనే మేము వచ్చాం. మేము వెంటనే వెళ్ళిపోవాలి!"

"మీరు శత్రువులు కాకపోతే మీ చేతుల్లో ఆ శూలాలు దేనికి?" అడిగాడు హిమవంత్. అనుచరుల చేతుల్లో కుడిచేత శూలం, యెడమచేత కాగడా ధరించి వున్నారు!"

"అసలు మిమ్మల్ని బంధించి తీసుకరమ్మని మా స్వామి ఆజ్ఞ కాని మాకు మా స్వామిపట్ల సదభిప్రాయంలేదు. ఆయన చర్యలు మాకిష్టంలేదు. అందుకే మేం మీతో చేతులు కలపాలనుకుంటున్నాం. మీ తాలూకు అమ్మాయి కూడా మా వద్దనే వున్నది!"

అందరు ఏక కంఠంతో "నిజంగానా? ఆమె క్షేమమే కదా!" అన్నారు.

"ఇప్పటివరకు క్షేమమే! నిధి చేజిక్కేవరకు క్షేమం గానే వుంటుంది. నిధికోసం ఆమెని బలిచేయాలని మా

స్వామి నిర్ణయం!"

కార్తీక్ దవడ కండరాలు బిగుసుకున్నాయి.

"ఎంత దారుణం! నిధికోసం ఓ అమాయకురాలి నిండు ప్రాణం బలిచేయాలని తలపెట్టారా?"

"ప్రాణం బలిచేసేనేగాని నిధి దక్కదు! ఓ కన్నె పిల్ల రక్తం తర్పణంతో నిధికి పట్టిన పిశాచం తొలగిపోతుంది సంతృప్తిపడి! ఆ తర్వాత నిధి మా వశమవుతుంది. అందుకే స్వామి మీ అమ్మాయిని ఎత్తుకువచ్చి నిర్బంధించాడు మా స్థావరంలో!"

కార్తీక్ పిడికిళ్ళు టెన్షన్‌తో బిగిశాయి. "అయితే యిప్పుడు మీరు వచ్చిన పని....?" అడిగాడు.

"నిధి కోసమనే మీతో మాట్లాడాలని వచ్చాం! ఆ నిధిని క్షేపాలను సూచించే రాగిపలక మీ వద్ద వున్నదని మా వాళ్ళకి తెలిసింది. అది లేకుండా నిధి రహస్యం తెలుసుకోవటం చాలా కష్టం. మీరు మాకు ఆ ఫలకం యిస్తే, మేము ఆ నిధిని కనుక్కుంటాం. సగం మీకు, సగం మాకు!"

"అయితే రాగిపలక మీద నిధి వివరాలన్నీ వివరంగా రాసి వున్నాయా?"

"అవును. చాలా వివరంగా వుంటాయి. ఆ తామ్ర పత్రంకోసమని మా గురువుగారు పన్నెండు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నారు. కాని దొరకలేదు. మీకెలా చిక్కిందో మా కెవరికీ అర్థం కాలేదు!"

"మీ కళ్యాణస్వామికి క్షుద్ర విద్యలు తెలుసా?"

"తెలుసు. ఆయన ఒక్కడికే తెలుసు. ఆయన నిత్యం దేవిని ఉపాసిస్తుంటాడు. ప్రత్యేకంగా ఓ పూజామందిరం కట్టుకుని అందులో దేవిని ఉపాసిస్తుంటాడు. ఆ మందిరం

లోనికి మాక్కూడా ప్రవేశంలేదు!"

అశ్వని వెంటనే యేదో గుర్తువచ్చి అడిగాడు. "కొద్ది నిమిషాల క్రితం మా ముందు అస్థిపంజరాలు నాట్యం చేశాయి. పెద్దగా అరుస్తూ కేకలు వేశాయి. వాటిని మామీద ప్రయోగించిన వాళ్ళు మీరు కాదా?" అని.

"మాలాంటి మరో నలుగురు అనుచరులు! అయితే వాళ్ళక్కూడా క్షుద్ర విద్యలు తెలియవు. కేవలం హస్త లాఘవంతోను, ధ్వన్యనుకరణతోను మీకు నిజంగా అస్థిపంజరాలు నాట్యంచేస్తున్న భ్రమ కల్పించారు!"

"అంటే....నిజంగా అవి నృత్యం చెయ్యలేదా?"

"చేయించారు....మీకు చీకట్లో కనిపించి వుండదు గాని యిప్పుడు మీరున్న సొరంగంపైన చిన్న చిన్న కంతలున్నాయి. మనం యిప్పుడు నిల్చుని వున్న యీ సొరంగం నేలమాళిగన్నమాట! దీని పై కప్పునుచేరే అక్కడనుంచి సరాసరి కళ్యాణ దుర్గం చేరతాం. మరి కొంతదూరం వెళ్ళాక సొరంగం మలుపు తిరుగుతుంది. ఆ మలుపులో మెట్లున్నాయి పైకి. అవి ఎక్కితే మీరీ దారి లోకి ప్రవేశించిన ముఖద్వారం, రెండో సొరంగందారి విడిపోయిన కూడలికి సరాసరి తోవ యేర్పడుతుంది.

"మా సహచరులైన అనుచరులు సొరంగం పైనుంచి అస్థిపంజరాల చేతులకి తాళ్ళుకట్టి, వాటిని వాళ్ళు పై నుంచి లాగటంవల్ల దించటంవల్ల అస్థిపంజరాలు గాల్లో నృత్యం చేసిన భ్రమ కలుగుతుంది మీకు!"

అందరు ఆశ్చర్యంతో నోళ్లు తెరిచారు.

హిమవంత్ ముందుగా తేరుకుని, "మరి ఆ భయంకర శబ్దాలు, అరుపులు, కేకలు....?" అంటుండగానే అను చరుల్లో ఒకడు అందుకుని, చెప్పానుగా, అది ధ్వన్యను

కరణ. పైనున్న కంతలద్వారా నోరుపెట్టి రకరకాల శబ్దాలు నోటితో చేసి అవి పిశాచాలు క్షుద్రశక్తులు అరిచినట్టుగా భ్రమింపచేస్తారన్నమాట! మీ దృష్టి అంతా అస్థిజంజరాల క్రోవ్యంమీద కేంద్రీకరింపబడి వుండటం వల్ల మీకు ఆ కేకలు అస్థిపంజరాల నోళ్ళనుంచే వచ్చినట్టు అనిపిస్తోంది. ఇదంతా మా గురువుగారిచ్చిన ట్రయినింగు."

"అలా చెయ్యటంవల్ల మీకొచ్చే లాభమేమిటి?"

"బయటనుంచి యెవరూ కళ్యాణ దుర్గం చేరనివ్వకుండా మా గురువుగారు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఇలా యెవరైనా ప్రవేశిస్తే వాళ్ళను అక్కడికక్కడే చంపేసే యేర్పాటు ఇది! ప్రతిసారి మా గురువుగారు రానక్కర్లేకుండా, యెలాంటి ఆయుధాలు వాడనవసరం లేకుండా, శత్రువుకు యెదురుపడకుండానే చంపే పద్ధతి యిది! అస్థిపంజరాలు గాల్లో లేచి ఆడగానే, భయంతో శత్రువు బిగుసుకుపోయి ప్రాణాలు వదిలేస్తాడు కదా! అంతకీ ప్రాణం పోకపోతే సరాసరి అస్థిపంజరాల్ని రాళ్ళమీదికి విసిరేస్తారు. దాంతో శత్రువు బేజారెత్తి ప్రాణాలు వదుల్తాడు. అప్పటికీ చావకపోతే మా చేతుల్లోని శూలాల్ని ఉపయోగిస్తాం?"

"ఆ పనేదో మొదటే చెయ్యొచ్చు కదా!"

"చెయ్యవచ్చు గాని, ఎక్కువమంది శత్రువు లున్నప్పుడు, వాళ్ళ చేతుల్లో మారణాయుధాలునప్పుడు, స్వామి యీ పద్ధతిని ప్రయోగించమని చెప్పాడు!"

"దారుణం, అమానుషం! మనిషిని హింసించి, భయభ్రాంతుల్ని చేసి చంపటమన్నమాట!"

"మాకు తిరిగి వెళ్ళాల్సి వుంది కాబట్టి, మనం యిక విడిపోవాలి. రాగిరేకు మాకు యిచ్చి మీరు యిక్కడే

ఎక్కడో దాక్కొని వుండండి. తెల్లవారేసరికల్లా గుట్టు చప్పుడు కాకుండా తక్కిన అనుచరుల్ని, కళ్యాణ్యస్వామిని పట్టుపెట్టి, నిధిని చేజిక్కించుకుంటాం. మీ స్నేహితురాల్ని క్షేమంగా కాపాడి తీసుకొస్తాం. మీకు రావలసిన సొమ్ము మీకు పంచి యిచ్చేస్తాం!" మొదటి వ్యక్తి అన్నాడు.

కార్తీక్ అతనివంక చూసి, మరి మా వాళ్ళు మరో యిద్దరు రెండోదారి వెంబడి వచ్చారు, కనిపించారా?" అనడిగాడు.

"ఈసరికి వాళ్ళు మావాళ్ళ చేతుల్లో పడుంటారు. ఆ దారి సరాసరి కళ్యాణదుర్గం చేరిపోతుంది. మలుపుతిరిగితే మనం నిల్చున్న ఈ సొరంగం మెట్లదగ్గరికి దారితీస్తుంది. మెట్లెక్కితే సరాసరి కళ్యాణదుర్గం కనిపిస్తూవుంటుంది. మరి, మీ అనుమానాలు తీరినట్టే కదా, ఆ రాగిరేకు యిస్తారా?"

"మిత్రులారా, దురదృష్టవశాత్తూ ఆ రాగిరేకు మా రెండోవర్గం వాళ్ళతో వుండిపోయింది. ఈపాటికి వాళ్ళు కళ్యాణదుర్గం చేరివుంటే, మీ సహచరులు దాన్ని స్వాధీనం చేసుకుని వుంటారేమో!...." అన్నాడు కార్తీక్.

"అరె. ఎంతపని జరిగింది? రాగిరేకు మీ దగ్గర వున్న విషయం మా స్వామికి తెలిసిపోయింది. అసలు మీ అందర్ని తన దగ్గరకు రప్పించుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. మీ స్నేహితురాల్ని హింసించి మీ అందర్ని పేరు పేరునా పిలవమని శాసించాడు. ఆమె పిలిచే సమయంలో మేం అక్కడే వున్నాం!"

కార్తీక్ మనసు పిండినట్టయింది ఈ మాటలతో.

"మమ్మల్ని రప్పించుకోవటానికి ఆ అమ్మాయిని హింసించటం దేనికి? బంధింపజేసి తీసుకుపోవచ్చు కదా!" అన్నాడు.

"చెప్పాను కదా, మా స్వామి మన స్తత్వం చాలా విచిత్రమయినది. హింసించి చంపటం, ప్రాణాలతో ఆడుకుని ఆనక వాటిని తీసెయ్యటం—ఆయన సరదాలు. అలాంటి ఆటలో ఓ భాగమే లే ఆమెను హింసించటం!"

"అయితే మాకు ఎలాంటి ఆక్రందనలు వినిపించ లేదే....?"

"చెప్పాను కదా, యీ దారికన్న మీ మిత్రులు వెళ్ళిన దారి సరాసరి కళ్యాణదుర్గాన్ని చేరే దారి అని. వాళ్ళకు వినిపించి వుంటుంది! ఈ మలుపు తిరిగితే మీకూ వినిపిస్తూంది!"

"అయితే మమ్మల్నేం చెయ్యమంటారో చెప్పండి" అన్నాడు కార్తీక్.

"రాగిరేకు యీ పాటికే మా వాళ్ళకు చిక్కివుంటే వెంటనే తమ కార్యక్రమం అమల్లో పెట్టేసారు. అది మీ స్నేహితురాలి బలి కార్యక్రమంతోనే ప్రారంభమవుతుంది!"

వింటున్న ముగ్గురు త్రుళ్ళిపడ్డారు.

"అయితే మనం ఉపేక్షించటానికి వీల్లేదు! వెంటనే మేము కళ్యాణదుర్గం చేరుకోవాలి....!" అన్నాడు కార్తీక్.

"అదెంత సేపు? పది నిమిషాల్లో మీరు కళ్యాణదుర్గం చేరుకోగలరు! అయితే మీ ప్రాణాలకు ప్రమాదం రాకుండా చూసుకోవాలి కదా! మీరు ఎవరికీ కనపడకుండా కళ్యాణదుర్గం రెండో ద్వారం దగ్గిర యెదురు

చూడండి. దుర్గానికి రెండు ద్వారాలుంటాయి. మొదటి ద్వారం మా గురువుగారి స్థావరానికి, పూజామందిరానికి దారితీస్తుంది. రెండో ద్వారందగ్గర యెవరూ వుండరు. మీరు అక్కడ వున్న రాళ్ళగుట్టల వెనక దాక్కొని వుండండి. ఏం జరిగినదీ వివరంగా మాలో ఒకడు అక్కడి కొచ్చి తెలియజేస్తాడు. మేము వెంటనే వెళ్ళి మీ స్నేహితురాలు బలి కాకుండా జాగ్రత్త తీసుకుంటాం!" అన్నాడు మొదటి వ్యక్తి.

కార్తీక్ తలూపాడు.

హిమవంత్ కాగడాలు చెరో చేత్తోను పట్టుకున్నాడు.

"ఇవిగో యీ రెండు కాగడాలు మీ రుంచుకోండి. అవసరమైతే తప్ప వీటిని ఉపయోగించవద్దు. వెలుతురు కనిపిస్తే ప్రమాదం! ఆర్పివేసి మీతో వుంచుకోండి" అన్నాడు ఆ వ్యక్తి.

"మరి వీటిని వెలిగించుకోవటానికి మాదగ్గర అగ్గిపెట్టె లేదు, ఎలా మరి!"

"ఇదిగో, అందుకు సాధనం—చెకుముకిరాళ్ళు! వీటితో నిప్పుచేసి కాగడా వెలిగించుకోండి!"

కార్తీక్ "కాగడాలు తీసుకో హిమా!" అన్నాడు.

"మేం వెళ్తున్నాం. మా వాళ్ళకు ఇప్పటికే అనుమానం వచ్చివుండొచ్చు. జాగ్రత్తగా వ్యవహరించక పోతే అందరికి ప్రమాదం!" అంటూ వాళ్ళు నలుగురు వచ్చినదారినే చకచక వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన కొద్ది నిమిషాలకు కార్తీక్, అశ్విని, హిమవంత్ బయల్దేరారు.

ఓ ఫర్లాంగుదూరం వెళ్ళేటప్పటికి సొరంగం మలుపు తిరిగింది.

ఒక్కసారిగా పచ్చటి వెల్తురు వాళ్ళ కళ్ళలోకి సూటిగా పడింది.

హిమవంత్‌ని చూసి, "అదిగో అదే కళ్యాణదుర్గం అయివుంటుంది. ఆ వెల్తురు అక్కడ్నుంచే వస్తున్నదని వాళ్ళు చెప్పారు కదా!" అన్నాడు కార్తీక్. "కాగడాలు ఆర్పెయ్యి."

హిమవంత్ కాగడాలు నేలకొట్టి ఆర్పేశాడు.

అక్కడ పైకి వెళ్ళటానికి మెట్లు కనిపించాయి.

* * *

"అదిగో, ఆ పచ్చటి వెలుతురు వస్తున్నవైపునుంచే దీప్తి కేకలు వినిపించాయి!" అన్నాడు అభిలాష్.

పచ్చటి వెల్తురు చాలా దగ్గర్లో కనిపించింది.

ఆ వెలుగు పడినంతమేరం పరిసరాలన్నీ పచ్చటి కాంతిని సంతరించుకుంటున్నాయి.

"అదేమిటి, ఏదో కోట ప్రాకారంలాగా కనిపిస్తోంది. ఏదో దుర్గంలాగా లేదూ?" అన్నాడు వర్మ దీక్షగా ఆ కాంతివైపు చూస్తూ.

"అవును, ఆ పచ్చటి కాంతికిరణాలు మనకు దూరం నుంచి యేదో దీపంలాగా కాంతివంతంగా కనిపించింది. ఆ దుర్గంమీది నుంచి పగలు ఒక రకంగానూ, రాత్రి మరో రకంగానూ కనిపిస్తోంది వెల్తురు" అన్నాడు అభిలాష్.

వర్మ రివాల్వర్ గురిగా పట్టుకుని, "సరే, అక్కడ దీప్తికి ఎలాంటి ప్రమాదం యెదురయిందో నాకు ఊహకందటంలేదు! ఆమె అరుపులు కూడా ఆగిపోయాయి. కొంపతీసి యీ పాటికి ఆమెను...." అంటూ ఆగిపోయాడు.

"అదే నాకూ అనుమానం వస్తోంది! సరే ముందుకు పోదాం, యేమవుతుందో చూద్దాం! ఆ అరుపులు మాత్రం కచ్చితంగా మిస్ దీప్తివే, అనుమానం లేదు!...."

ఇద్దరు వేగంగా అడుగులు వేస్తున్నారు. పచ్చటి కాంతి వాళ్ళకు చక్కటి బాటలాగా కనిపిస్తోంది.

"మిస్టర్ అభిలాష్, అది మామూలు దుర్గం కాదు. దాని గోడలు బంగారువర్ణంతో మెరిసిపోతున్నాయి. బురుజులు బంగారు రేకుతో తాపడం చేసినట్టు మిలమిల మెరుస్తోంది. ఎక్కడినుంచీ కాంతికిరణాలు రావటం లేదు. ఆ బంగారురంగు పచ్చటి కాంతిగా పరావర్తనం చెంది వెలుగుగా ప్రసరిస్తోంది.

"అదిగో ముఖద్వారం చూశారా? అదికూడా బంగారు రంగుతో మెరుస్తోంది. నాలుగయిదు నిలువుల ఎత్తు సింహద్వారం, దానికి యెంతో బలమైన తలుపు—అన్నీ బంగారు వర్ణంతో ధగధగ లాడుతున్నాయి. ప్రాకారాలు, దుర్గం శిఖరాగ్రం, అన్నీ బంగారంతో చేసినట్టే కళ్ళు మిరుమిట్లుగొలుపుతున్నాయి.

"అభిలాష్, యీ రేకు సరిగ్గా చూసిచెప్పు! ఇదిగో, యీ బొమ్మకు యీ దుర్గానికి యెంతో దగ్గర సంబంధం వుంది కదూ! నన్నడుగుతే ఇదే నిధిని తెచ్చిపాలున్న ప్రదేశమయివుంటుంది. నాకు నమ్మకం కలుగుతోంది. నిధి పాతిపెట్టబడిన ప్రదేశం ఖచ్చితంగా ఇదే. ఇదే! కొన్ని వేల కోట్ల విలువచేసే నిధి. లక్షా, రెండులక్షలా! కొన్ని వేల కోట్లు! ఓహ్, ప్రపంచంలో యే సామ్రాజ్యాధినేత కూడా ఇంత ఐశ్వర్యవంతుడయి వుండలేదు. లక్ష్మీదేవి కోరి మనల్ని వరిస్తోంది."

"కమాన్, టెల్ మీ! ఈ గుర్తులు, దాని కింద సంస్కృతంలో రాసిన అక్షరాలు యేమిటో వివరంగా చెప్పు! ఎక్కడ అవి నిక్షిప్తమై వున్నాయో, ఎంత లోతున ఉన్నాయో అన్నీ గబ గబా చెప్పాలి, క్విక్!"

వర్మ అడ్డు అపు లేకుండా, ఉన్మాదిలాగా పేల్తున్నాడు. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. నాట్యం చేస్తున్నట్టు చకచక ముందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నాడు. రాగిరేకును పదేపదే ముద్దు పెట్టుకుంటున్నాడు. నిధి అప్పుడే తనవశమైపోయినట్టు తను కోటికి పడగలెత్తిన మహాసామ్రాజ్యాధినేతలాగా ఆనందంతో ఉప్పొంగిపోతున్నాడు.

అభిలాష్‌కు చర్రున కోపం వచ్చేసింది. "వర్మగారూ! అవతల మిస్ దీప్తి ఆపదలో వున్నది. బతికే వున్నదో, ఈపాటికి ప్రాణాలు పోగొట్టుకొన్నదో మనకు యేసంగతీ తెలియదు. మీరు చూడబోతే నిధి—నిక్షేపం అంటూ ఆనందతాండవం చేస్తున్నారు. ఇది డబ్బుకోసం పాకులాడే సమయమా? మనిషి ప్రాణంకన్నా డబ్బుకే విలువ ఎక్కువా?" అన్నాడు.

వర్మ ఉత్సాహమంతా నిప్పులో నీళ్లు చల్లినట్టు ఒక్కసారిగా చల్లారిపోయింది.

"సారీ, మిస్టర్ అభిలాష్. నేను ఈ దుర్గం చూసిన ఆనందంలో ఒళ్లు మరిచి...." అతనింకేదో అంటుండగానే దుర్గం లోపలినుంచి దీప్తి ఆర్తనాదం, స్పష్టంగా, చాలా స్పష్టంగా మళ్ళీ వినిపించింది.

అభిలాష్ వర్మవంక చురుగ్గా చూశాడు. వర్మ తప్పు చేసినవాడిలా ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

ఇద్దరూ కళ్యాణదుర్గం సమీపించారు.

దీపికేకలు వినిపించటంలేదు. మళ్ళీ పరిసరాలు భయంకరమైన నిశ్శబ్దంతో, చీమ చిటుక్కుమన్నా వినిపించేలా సబ్ధుగా అయిపోయాయి.

వర్మ రివాల్వర్ చేతిలో గురిగా పట్టుకున్నాడు.

ఇద్దరూ దుర్గం ముఖద్వారాన్ని చేరుకున్నారు.

బ్రహ్మాండమయిన తలుపు ముఖద్వారాన్ని పూర్తిగా మూసేసివున్నది. చుట్టూ ఎత్తయిన ప్రాకారం! అంతటా పచ్చటి వెలుగుకిరణాలు ఆ ప్రదేశాన్ని దేదీప్యమానంగా ప్రకాశింప చేస్తున్నాయి.

"ఇక్కడ లోపలికి ప్రవేశించటానికి ద్వారం కనిపిం పించటంలేదే!" అన్నాడు వర్మ, తలెత్తి ముఖద్వారానికున్న బ్రహ్మాండమైన తలుపులవంక చూస్తూ.

తలుపుల ఎత్తు కనీసం ఇరవై నాలుగు అడుగులకు తక్కువ వుండదు! తలెత్తి చూస్తే మెడలు నొప్పి పుట్టేటంత ఎత్తయిన తలుపులు! తలుపులకి తాపటం చేసిన బంగారు రేకు, వన్నె మాసిపోయినా కాంతి మాత్రం తగ్గలేదు!

"ఇదిగో, ఈ పక్కనుంచి చిన్న తలుపు వున్నది, చూశారా?" అన్నాడు అభిలాష్. పెద్ద తలుపులు రెండిటిలో ఓ తలుపుకు అడుగుభాగంలో రెండడుగుల వెడల్పు, నాలుగడుగుల ఎత్తూ వున్న చిన్న తలుపు అమర్చబడివున్నది! ఆ తలుపు కాస్త ఓరవాకిలిగా తెరిచి వున్నది! మనిషి లోపలికి కావాలంటే, సగానికిపైగా వంగిపోయి లోపలికి ప్రవేశించాల్సి వుంటుంది.

కరెక్టు! చాలా పురాతనమయిన కట్టడాలకు ఇలాంటి పెద్ద తలుపులు పెట్టి, కిందినుంచి ఇలాంటి తలుపుపెట్టడం

నేను చాలా ఉదంతాలు విన్నాను. అంతఃపుర ద్వారాలకు కూడా మహారాజులు ఇలాంటి ఏర్పాట్లు చేస్తూండే వారట!" అన్నాడు వర్మ.

తలుపు తోశాడు అభిలాష్—కిర్రుమనే చప్పుడుతో తెరుచుకున్నది తలుపు.

ముందుగా అభిలాష్ లోపలికి అడుగుపెట్టాడు. వర్మ అతని వెనుకనే రివాల్వర్ గురిచేసుకుని తలుపుదగ్గర వంగుతున్నాడు.

అంతే! అతని చేతిలోని రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది. అకస్మాత్తుగా నలుగురు వ్యక్తులు వాళ్ళిద్దరిమీద ఎక్కడినుంచో వచ్చి పడ్డారు.

అభిలాష్ వాళ్ళకు చిక్కకుండా తప్పించుకుని, ఎగిరి ఒకడి డొక్కలో తన్నాడు. వాడు కుయ్యోమంటూ కూలబడిపోయాడు. ఇంకొకడ్ని యెగిరి గుండెలమీద తన్నాడు. వాడు అల్లంతదూరంలోపడి, మళ్ళీ అంత వేగంగాను లేచి నించున్నాడు.

ఈలోపల వర్మ తనమీద పడిన యిద్దర్నీ చంకల్లోను యిరికించుకుని బలంగా నొక్కాడు. వాళ్ళు చుక్కల్లా వంగి అతని పట్టునుంచి తప్పించుకున్నాడు. ఈలోగా అభిలాష్ చేత తన్నులుతిన్న యిద్దరు లేచి, అంత వేగంగాను అభిలాష్ మీద పడ్డారు.

వర్మ నేలబారుగా దొర్లి రివాల్వర్ అందుకోవాలని ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నం ఫలించేలోపల తక్కిన ఇద్దరు వ్యక్తులు వర్మను గట్టిగా పట్టుకున్నారు. రివాల్వర్ని కాలితో తన్నేశాడు ఒకడు. రెండోవాడు వర్మ దుస్తులు వెతకసాగాడు.

ఈలోపల అభిలాష్ను పట్టుకున్న వ్యక్తులు అతని

దుస్తులు వెతికి "లేదు!" అంటూ తక్కిన ఇద్దరికీ సంజ్ఞ చేసి చెప్పారు.

అందులో ఒకడు వాళ్ళిద్దరివంకా తీవ్రంగా చూస్తూ, "ఆ రాగి ఫలకం ఎక్కడ దాచారు?" అన్నాడు.

"ఏ రాగి ఫలకం?" అన్నారు వర్మ, అభిలాష్ ఒకే సారి.

"ఏ రాగిఫలకమో మీకూ తెలుసు, మాకూ తెలుసు. అది ఎక్కడ దాచారో వేగిరం చెప్పండి. లేకపోతే మీ యిద్దరి ప్రాణాలు నిలువునా తీసేస్తాం!" అన్నాడు ఓ వ్యక్తి.

"మీరనేదేమిటో మాకర్థం కావటంలేదు. మాకు ఏ విధమైన రాగిపలక గురించీ తెలియదు. మీరెవరు, మమ్మల్ని ఎందుకిలా నిర్బంధిస్తున్నారో అంతకన్నా తెలియదు!" అన్నాడు వర్మ.

మొదటి వ్యక్తి వర్మ రెండు చెంపలు ఛెళ్ళుఛెళ్ళున చరిచాడు. "అబద్ధమాడాలని ప్రయత్నిస్తే అమ్మవారికి బలేస్తాం, జాగ్రత్త! మర్యాదగా ఎక్కడ దాచారో చెప్పండి!" అన్నాడు.

వర్మ కోపంతో పళ్ళు పటపట కొరికాడు. ఒక్కసారిగా వాళ్ళ పట్టు సడలించుకుని లాగి ఆ వ్యక్తి చెంపమీద బలంగా కొట్టాడు. ఇంకా కసితీరక ఎగిరి వాడి గుండెలమీద తన్నాడు.

ఈలోపల అభిలాష్ కూడా తన బంధాలు వదిలించుకోవాలని చూశాడు. కాని ఆ ఇద్దరు వ్యక్తులు యే మాత్రం పట్టు సడలించలేదు.

మొదటి వ్యక్తి కిందపడివున్న శూలంతీసి దాన్ని

వర్మ గుండెలకు గుచ్చి, "యేరా పొగరుగా వుందా? నామీదనే చెయ్యి చేసుకుంటావా? జాగ్రత్త, యీ శూలాన్ని నిలువునా నీ గుండెల్లో దించేస్తాను" అన్నాడు శూలాన్ని మరింత నొక్కిపెడుతూ.

వర్మ గుండెల దగ్గర రక్తం చివ్వున పైకి తన్నింది.

"మిస్టర్ వర్మా, వాళ్ళతో వాదన పెట్టుకోవద్దు! కోరి కొరివితో తలగోక్కున్నట్టే!" అన్నాడు అభిలాష్ మెల్లగా.

ఈ లోపల ఓ వ్యక్తి యెక్కడినుంచో తాళ్ళు పైకి తీసి వర్మను పెడరెక్కలు విరిచి కట్టాడు. అదే తాడుతో అభిలాష్ చేతులుకూడా వెనక్కి విరిచి కట్టేశాడు.

నలుగురు ముందుకొచ్చి, "మీ చేత నిజం యెలా చెప్పించాలో మా గురువుగారు చూసుకుంటారు, మేము మర్యాదగా అడిగితే చెప్పరూ? సరే, పదండి!" అంటూ తాళ్ళ రెండు చివర్లో పట్టుకుని లాక్కుపోసాగారు.

• • •

కార్తీక్, అశ్విని, హిమవంత్ మెల్లెక్కి పైకొచ్చారు. సమతలమైన ప్రదేశం కనిపించింది.

దూరంగా పచ్చటి వెల్తురు కళ్ళకు మిరుమిట్లు గొలుపుతోంది.

"కార్తీక్, ఆ వెల్తురు యెక్కడ్నుంచి వస్తున్నదో యిప్పుడర్థమవుతోంది. వాళ్ళు చెప్పిన కళ్యాణ దుర్గంనుంచే ఆ కాంతికిరణాలు వస్తున్నాయి. అదే మనకు ఏదో దీపం వెల్తుర్లా అనిపించింది. అద్భుతమైన దృశ్యం!" అన్నాడు అశ్విని.

అందరు ఆ దుర్గం సౌందర్యాన్ని, బంగారుకాంతు లీనుతున్న ప్రాకారాల్ని, బురుజుల్ని, కోట తలుపుల్ని,

వాటికి తాపడం చేసిన బంగారు రేకుల్ని స్పష్టంగా, అతి దగ్గరగా చూశారు.

"ఈ వెలుగే మనకు ఈ సౌరంగంలోనికి ప్రవేశించి ముందునించీ కనిపిస్తోంది. ఎంత గొప్ప కట్టడం! కళ్యాణ వర్మ నిజంగా కలియుగ మయ బ్రహ్మలా వున్నాడు. సొరంగాన్ని తొలిచి అద్భుతమైన దుర్గాన్ని నిర్మించాడు!" అన్నాడు కార్తీక్.

"మనం చూసిన రాగిఫలకంలో ఈ దుర్గం స్కెచ్ గీయబడి వున్నది! ఇందాక కళ్యాణస్వామి అనుచరులు చెప్పినదాన్నిబట్టి చూస్తే ఆ రాగిఫలకంమీద నిధి నిక్షేపాల సంగతి పూర్తిగా వివరించబడివుండే వుంటుంది. అభిలాష్ కావాలనే అన్ని వివరాలు పైకి చెప్పలేదు, లోలోపల చదువుకోవటం చూసినపుడే అనుకున్నాను. అతను కావాలనే ఏదో దాస్తున్నాడని!" హిమవంత్ అన్నాడు.

"మనం అభిలాష్‌ని ఈ విషయంలో తప్పు పట్టాల్సిన పనిలేదు. వర్మ రాగిఫలకం విషయంలో అనవసర శ్రద్ధ చూపించటంవల్లనే అతడు కావాలని వివరాలు దాచి చెప్పాడు. ఓపక్క దీప్తి అంతర్థానమయి, మనం బాధ పడుతుంటే వర్మ నిధి నిక్షేపాల గురించి అడుగుతున్నాడు కదా, అభిలాష్ అందుకే నిజం చెప్పకుండా దాట వేశాడు" అన్నాడు కార్తీక్.

అశ్విని ఏదో చెప్పాలని నోరు తెరిచాడు. ఇంతలో ఎక్కడినుంచో స్త్రీ ఆర్తనాదం చెవులకు స్పష్టంగా తాకింది.

ముందుగా కార్తీక్ ఆ స్వరాన్ని గుర్తుపట్టాడు.

"అవును, ఆ కంఠస్వరం దీప్తిదే! అనుమానంలేదు"

అన్నాడు కార్తీక్.

అతని గుండె వేగంగా కొట్టుకుంటుంది.

అశ్విని, హిమవంత్ జాగ్రత్తగా చెవులు రిక్కించారు. కాని మళ్ళీ ఎలాంటి కేకలూ వినిపించలేదు.

“స్త్రీ ఆర్తనాదం వినిపించిందిగాని, అది ఎవరిదో గుర్తుపట్టలేకపోయాం! మళ్ళీ వినిపిస్తే చెప్పగలుగుతామేమో!” అన్నాడు హిమవంత్.

“నేను స్పష్టంగా విన్నాను. అది దీప్తి గొంతే. యేదో ప్రమాదంలో చిక్కుకున్నది! థాంక్ గాడ్! కనీసం ఆమె బతికి వున్నదన్న విషయం నిర్ధారణయింది, ఆమెని రక్షించుకోవలసిన బాధ్యత యిప్పుడు మనపై వుంది!” కార్తీక్ అడుగుల వేగం హెచ్చింది.

చకచక ముందుకు పరుగులాంటి నడకతో సాగిపోతుంటే అతని వెనుక అశ్విని, హిమవంత్ వేగంగా అడుగులు వేస్తున్నారు.

దుర్గం యిప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. కాంతి కిరణాలు సూటిగా వాళ్ళ కళ్ళకు తాకుతున్నాయి. కాని వాళ్ళు అవి ఏవీ గమనించే స్థితిలో లేరు.

దుర్గం మొదటి ద్వారం వద్దకు చేరుకున్నారు.

“ఆ తామ్ర ఫలకం యెక్కడ దాచారు?” మాంత్రికుడు కళ్యాణస్వామి అరుపుతో ఆ పరిసరాలు ధ్వనించాయి.

వర్మ, అభిలాష్ మాట్లాడలేదు. ఓ పక్కగా దీప్తిని కాళ్ళు చేతులు వెనక్కి విరిచి పట్టేసి వుంచారు. ఆమె తమ యిద్దరివంకా దీనంగా చూస్తోంది. ఆమె ముఖంమీద రక్తపు చారికలు కనిపిస్తున్నాయి. గతంలో చూసిన రాతిగదిలాంటి గదిలో తమ ఎదురుగా మూర్తీభవించిన

మృత్యువులా మాంత్రికుడు కళ్యాణస్వామి నిల్చుని కళ్ళ నుంచి నిప్పులు రాలుస్తున్నాడు.

వర్మ, అభిలాష్ తమవంక చూసుకున్నారు. అతి నిస్సహాయస్థితిలో కట్టుకున్న గుడ్డలన్నీ చీలికలై పోయి, అనుచరులు రాళ్ళమీద ఈడ్చుకురావటంవల్ల ఒళ్ళంతా చెక్కుకుపోయి రక్తం చిమ్ముతున్న గాయాల్తో దయా నీయమైన పరిస్థితిలో వున్నారు!

మాంత్రికుడి చేతిలో పొడవాటి వేట కత్తి వుంది. దాంతో వేటకొక్కడ్ని నరికిపారేయాలన్నంత కోపంగా వున్నాడు. అప్పటికి రెండు మూడుసార్లు ఆ రాగి రేకు గురించి వర్మను, అభిలాష్‌ను చెంపలు పగలేశాడు.

వర్మ ముక్కు, నోరు రక్తసిక్తమైపోయాయి. అభిలాష్ పరిస్థితి కూడా దాదాపు అలాగే వుంది!

"ఏరా, నువ్వు పెద్దమనిషిలా కనిపిస్తున్నావు, రాగి రేకు గురించి నిజం చెప్పదలచుకోలేదా? నిన్నీ క్షణంలో ఖండఖండాలుగా నరికినా అడ్డుకునేవాడు లేడు. నాతో సహకరించావంటే మీ అందర్నీ ప్రాణాలతో వది లేస్తాను, ఏదీ ఆ రేకు!?" కళ్యాణస్వామి అడిగాడు లాలనగా వర్మవంక చూస్తూ.

వర్మ కోపాన్నీ బాధనీ పళ్ళ బిగువున దాచుకొని, "నేను నిజమే చెపుతున్నాను. నా దగ్గర ఏ విధమైన రాగిరేకూ లేదు. ఇదే మాట నీ మనుషులు అడిగినప్పుడు కూడా చెప్పాను! మీరందరు మామీద కక్షపూని యిలా హింసించటం మా దురదృష్టం!" అన్నాడు.

కళ్యాణస్వామి వికటంగా నవ్వాడు. "ఆ రేకు పన్నెండేళ్ళుగా మాకెవరికీ దొరకలేదు. ఈనాడు మీ

కళ్ళబడింది. అది యింతకాలం ఆ ముసిలాడే దాచి వుంటాడని కల్లో కూడా ఊహించలేదు. ఏ మాత్రం నా ఆలోచన అటుపోయినా వాడినిప్పుడో పరలోకం పంపి ఆ రేకు స్వాధీనం చేసుకుని వుండేవాడ్ని" అన్నాడు.

"నిజంగానే వీళ్ళ దగ్గర లేదేమో స్వామీజీ, ఆ రేకు? వీళ్ళుగాక మరో ముగ్గురున్నారు, వాళ్ళు కూడా వస్తూవుంటారీపాటికి!" అన్నాడు ఓ అనుచరుడు.

ఓ పక్కగా అంతదాకా చోద్యం చూస్తున్నట్టుగా నలుగురు అనుచరులు నించుని వున్నారు. వాళ్ళు వర్మను, అభిలాష్‌ను లాక్కొచ్చినవాళ్ళే! వాళ్ళే కార్తీక్‌ని, అశ్వనిని, హిమవంత్‌ని అస్థిపంజరాలతో భయపెట్టడానికి ప్రయత్నించినవాళ్ళు.

"ఏరీ వాళ్ళు? వాళ్ళని తీసుకు రాలేదేం?" కళ్యాణ స్వామి కోపంగా చూశాడు—అలా అన్న అనుచరుడి వంక.

"అందుకోసం మన చిదానందుడు మరో ముగ్గురితో వెళ్ళాడు. ఈ పాటికి తిరిగొస్తూ వుంటారు...." అంటుండగానే చిదానందుడనబడే అనుచరుడు, మరో ముగ్గురు సహచరులతో అక్కడికొచ్చాడు.

"ఏరీ వాళ్ళు, ఎక్కడ?" కళ్యాణస్వామి కంఠం ఆ గదిలో మార్మోగింది.

"కనపడలేదు స్వామీజీ! తమ ఆదేశానుసారం రెండో మాళిగలో వెతుక్కుంటూ వెళ్ళాం. యెంత దూరం వెళ్ళినా వాళ్ళ జాడ కనిపించలేదు. రెండో మార్గంగుండా సరాసరి వచ్చేశారేమోనని తిరిగి వెనక్కు వచ్చేశాం!" అన్నాడు చిదానందుడు.

తక్కిన ముగ్గురు తలలూపారు.

"అబద్ధం స్వామీజీ! మేము అంతక్రితమే అస్థిపంజ రాల్ని పైనుంచి సొరంగంలోకి దింపి వాళ్ళని భయ పెట్టాలని ప్రయత్నించాం! కాని, యెలాగో వాళ్ళు ధైర్యం తెచ్చుకుని తుపాకీ మడమలతో అస్థిపంజరాల్ని నుగ్గు నుగ్గు చేసేశారు. మేము గొంతు మార్చి అరిచినా వాళ్ళు భయపడలేదు.

ఈలోగా వీళ్ళిద్దరూ దుర్గంవైపే నడుస్తూరావటం చూసి, మేము ఆ ముగ్గురి విషయం వదిలేసి ఈ ఇద్దరినీ బంధించాలని దుర్గం ద్వారం దగ్గర కాచుకుని వున్నాం. ఆ ముగ్గురి విషయం చిదానందుడు తను చూసి వస్తానని వెళ్ళాడు. ఇప్పుడు తమకి వాళ్ళెవరూ కనిపించటంలేదని ఎందుకు అబద్ధమాడుతున్నాడో అర్థంకాదు!" అన్నాడు మొదటి అనుచరుడు.

కళ్యాణస్వామి క్రోధంతో నిప్పుకణాలు వెదజల్లే చూపులో చిదానందుడ్ని సమీపించాడు.

"నిజం చెప్పు, ఇతను చెపుతున్నది నిజమేనా? నీకు గాని, ఈ ముగ్గురిలో యెవరికిగానీ ఆ ముగ్గురు కనిపించ లేదా? ఆ రాగిరేకును వాళ్ళ దగ్గర్నుంచి మీరు స్వాధీనం చేసుకుని, వాళ్ళెవరూ కనిపించలేదని బొంకుతున్నావా? నిజం చెప్పు లేకపోతే నిన్ను ఖండఖండాలుగా చీల్చి, నీ రక్తం క్షుద్రదేవతలకు తర్పణచేస్తాను" అన్నాడు.

చిదానందుడు తొణకలేదు. "నిజమే స్వామీజీ! వాళ్ళు కనిపిస్తే ప్రాణాలతో వదిలేవాళ్ళమా? ఆ రేకు దొరికితే తమకు సరాసరి తెచ్చి యిచ్చేవాళ్ళం. దాచుకుని గురుదేవులైన తమని మోసం చేస్తామా స్వామీజీ! మా మీద నమ్మకం లేదా? వరదుడు ఎందుకో నామీద

తమకు అవిశ్వాసం పుట్టిస్తున్నాడు!" అన్నాడు.

మొదటి అనుచరుడు — వరదుడు, కోపంగా చిదానందుడ్ని చూసి, "స్వామీజీ! తమరు ఉపేక్షించవద్దు. చిదానందుడికీమధ్య నిధిని తనే వశం చేసుకోవాలనే దురూహాపట్టి పీడిస్తోంది. శత్రువులతో చేతులు కలిపి, మనందర్నీ మోసం చెయ్యాలనుకుంటున్నాడని నాకు నిశ్చయంగా తెలుసు!" అన్నాడు.

కళ్యాణస్వామి పిడికిలి బిగించి చిదానందుడి గడ్డం కింద కొట్టాడు. ఆ దెబ్బకు చిదానందుడు గింగిరాలు తిరిగి నేలమీద పడ్డాడు. అతని నోటి చివర్లనుంచి రక్తం ధారలు కట్టింది.

"నిజం చెప్పకపోయినా, స్వామి ద్రోహం తలపెట్టినా ఈ స్వామి క్షమించడని గుర్తుంచుకో!" కళ్యాణస్వామి కాలితో, కిందపడిపోయిన చిదానందుడి గుండెల మీద బలంగా తన్నాడు.

చిదానందుడు నోరు మెదపకుండా భరించాడు బాధనంతా.

కళ్యాణస్వామి, అతనితో వెళ్ళిన ముగ్గురు సహచరుల వంక చూసి, "ఏరా, మీరైనా నిజం చెప్పండి. మీకు వాళ్ళు కనిపించలేదా? ఆ రాగిరేకును మీరు వాళ్ళ దగ్గర్నుంచి తీసుకున్నారా లేదా?" హుంకరించాడు.

వాళ్ళు ముగ్గురు కళ్యాణస్వామివంక చిదానందుడి వంక మిడిగుడ్లేసుకుని చూస్తుండిపోయారు.

చిదానందుడు నేలమీద దొర్లుతూనే కిందవున్న వేటకత్తిని చేత దొరకపుచ్చుకున్నాడు. ఒక్కసారిగా చివ్వున పైకిలేచాడు. మరుక్షణం కళ్యాణస్వామి తల నేలమీద బంతిలా దొర్లివుండేదే, కాని వరదుడు మెరుపు

వేగంతో చిదానందుడిమీదికి ఉరికి అతని ప్రయత్నాన్ని తన చేతిలోని శూలంతో భంగం చేశాడు.

కళ్యాణస్వామి కోపోద్రేకాలతో అరచిన అరుపుతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. చిదానందుడ్ని ఎగిరి గుండెలమీద తన్ని అతని చేతిలోని వేటకత్తి అందుకుని స్వయాన చిదానందుడి తల నరికేశాడు!

చూస్తున్నందరికీ కళ్ళు తిరిగి ఒళ్ళు తూలినట్లు భ్రాంతి కలిగింది.

దీప్తి ఈ దృశ్యం చూడలేక తలతిప్పుకున్నది. అభిలాష్ వర్మతోపాటు వరదుడు, తక్కిన అనుచరులు బిగుసుకుపోయారు.

చిదానందుడి ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమై పోయాయి. అతనితోపాటు శాస్త్రికి కలిసి మాట్లాడిన అనుచరుల పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి.

ఒక్కసారిగా ఆ ముగ్గురు కళ్యాణస్వామి పాదాల మీద పడిపోయి "మమ్మల్ని ఏం చెయ్యొద్దు గురుదేవా! చిదానందుడు వాళ్ళతో ఏం మాట్లాడాడో కూడా మేం వినలేదు. ముగ్గురు వ్యక్తులు మాళిగలో కనిపించారు మాకు! వాళ్ళు యిటే వస్తున్నారు!" అన్నారు.

కళ్యాణస్వామి ఆ ముగ్గురివంకా ప్రసన్నంగా చూసి, "ఇంతసేపు నేను గొంతు చించుకుంటుంటే సమాధానం చెప్పరేం మరి! ఈసారికి క్షమించి వదిలిపెడ్తున్నాను. బుద్ధి కలిగి వుండండి!" అన్నాడు.

ఆ ముగ్గురు తేలిగ్గా శ్వాసపీల్చుకున్నారు.

కళ్యాణస్వామి వరదుడివంక తిరిగి, "మీరు వెంటనే దుర్గం ముఖ ద్వారం దగ్గరకు వెళ్ళండి. శత్రువులు ఈపాటికి అక్కడికి చేరుకొని వుంటారు. వాళ్ళని చంప

కుండా నా దగ్గరకు తీసుకురండి!" అన్నాడు.

వరదుడు, చిదానందుడి సహచరులవంక తలతిప్పి చూసి, "మీ ముగ్గురు యిక్కడే వుండండి! మేం నలుగురం పోయి వస్తాం!" అని తన సహచరులు ముగ్గుర్ని తీసుకొని బయటకు పరుగెత్తాడు.

కళ్యాణస్వామి వర్మవంక క్రూరంగా చూసి, 'మీ వాళ్ళెవరో మరో ముగ్గురు వస్తున్నారట! వాళ్ళ దగ్గర ఆ రేకుఫలకం దొరికిందా సరే, లేకపోతే మీ అందర్నీ యిక్కడే దేవికి వరసబలులిచ్చేస్తాను! మీ రక్త తర్పణంతో అమ్మకు ఘనంగా విందు చేస్తాను. మీలో మీరు ఓ నిర్ణయానికొచ్చి నా ఫలకం వశం చేయండి. లేదా, యిదుగో ఈ స్వామి ద్రోహి చిదానందుడే మీకు మార్గం చూపుతాడు!" అన్నాడు కర్కశంగా.

* * *

"లోపలికి వెళ్ళటం మంచిది కాదేమో!" అన్నాడు కార్తీక్ దుర్గం ముఖద్వారం దగ్గర ఆగి, చిన్న తలుపు వంక పరీక్షగా చూస్తూ.

అక్కడ నేలమీద అంతక్రితమే ఎవరో పోట్లాడుకున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇసుకలో గుర్తులు కనిపిస్తున్నాయి. ఎవర్నో ఈడ్చుకుపోయిన లక్షణాలు దృగ్గోచరమవుతున్నాయి!

అశ్విని, హిమవంత్ అవునన్నట్టు తలలూపారు.

"అంటే, వర్మగారు, అభిలాష్ శత్రువులకి దొరికిపోయి వుండొచ్చు" అన్నాడు కార్తీక్.

"అయితే మనం వెంటనే ఈ ద్వారంగుండా లోనికి వెళ్ళి వాళ్ళను రక్షించుకోవద్దా?" అన్నాడు అశ్విని.

(ఇంకా వుంది)